
# తులసిపుష్పం

కొడాలి సాంబశివరావు




స్కూల్లో అడుగు పెడుతూనే "గుడ్ మార్నింగ్ టీచర్!" అంటూ ఎదురొచ్చిన తులసిని చూసి నవ్వుతూ విష్ చేసింది జలంధర. రోజు మాదిరి సంచి లోంచి గులాబి పువ్వు తీసి ఆమెకిచ్చాడు. పువ్వు అందుకుంటూ ఆప్యాయంగా నవ్విందామె. ఆ నవ్వుకు వాడు పరవశించి పోయాడు 'అబ్బ! టీచర్ ఎంత బాగా నవ్వుతుంది...' తేనెకన్న తియ్యగా, వెన్నెల కన్న చల్లగా నవ్వుతున్న టీచర్ కేసి తృప్తిగా చూశాడు తులసి.

"ఏది మరిచినా, పువ్వు తేవడంమాత్రం మర్చిపోవు—" ప్రేమగా వాడి నుదురు చుంబించింది. ప్రతి దినం క్రమం తప్పకుండా వాడు పువ్వు తెస్తాడు. ఆ పువ్వు టీచర్ సిగలో అందంగా నిలుస్తుంది. టీచర్ అలంకరించుకుంటే వాడికేదో సంబరం. జలంధర చాలా అందంగా వుంటుంది. గుండ్రటి సిగలో గులాబీ తురిమితే మరింత అందంగా కనిపిస్తుంది వాడి కళ్లకు.

మొదట్లో ఓరోజు అడిగింది- 'రోజూ పువ్వు తెస్తున్నావు ఎక్కడివి?" అని.

"మా పెరట్లో పూస్తున్నాయి టీచర్. మా యింట్లో పెట్టుకునేవాళ్ళు లేరు. తాతయ్య తిసికెళ్ళమంటాడు అదేం చిత్రమో మీ కోసమే నన్నట్టు రోజు కో పువ్వు మాత్రమే పూస్తుంది."

వాడి మాటలకు ఆమె నిండుగా నవ్వుతుంది. గులాబీలంటే ఆమెకు అమిత మక్కువ. అవి తెచ్చిస్తున్న తులసి మీద కూడా అభిమానం పెరగ సాగింది క్రమ క్రమంగా.

ఓ రోజు మామూలుగా పువ్వు తీసుకుని టీచర్ కోసం స్కూలు గేటువద్ద నిలుచున్నాడు తులసి. ఆవేళ ఎందుకో టీచర్ రావడం ఆలస్యమయింది. ఫస్టు బెల్లు కొట్టేరు అందరూ అసెంబ్లీ హాలు వేపు వెళ్ళసాగరు. తులసి మాత్రం టీచర్ కొరకు ఎదురు చూస్తూ అక్కడే నిలబడ్డాడు. చాలా సేపు ఎదురుచూసి నిరాశపడిపోయాడు. మనస్సంతా దిగులుగా అయిపోయిందివాడికి. మరో రెండు నిముషాలు అలాగే రోడ్డుమీదకు చూస్తూ నిలుచున్నాడు. ఇంతలో వసంత టీచర్ అటుగా వచ్చి వాడిని చూసింది.

"ఎందు కిక్కడున్నావ్?" అని కోపంగా ప్రశ్నించి, ఏదో గుర్తుకు వచ్చినదానిలా హేళనగా, క్రూరంగా నవ్వింది.

"ఓ.. నీ ప్రియురాలికోసం ఎదురు చూస్తున్నావా?" అంటూ పకపక నవ్వింది. ఆమె మాట్లాడే దేమిటో పదేళ్ళ తులసికి పూర్తిగా అర్థం కాలేదు. కాని జలంధర టీచర్ని గురించి ఏదో చెడ్డగా అంటుందని గుర్తించాడు. ఆమె నవ్వు చూసి అసహ్యమేసింది వాడికి—

'ఛీ ఎందుకలా పళ్ళు బయట పెట్టి వికారంగా నవ్వుతోంది? అదే జలంధర టీచర్ నవ్వితే ఎంత చల్లగా వుంటుంది!' జలంధర నవ్వినా, నడిచినా ఆమె ఏంచేసినా వాడి కళ్ళకు తృప్తిగా అందంగ వుంటుంది.

అదేదో జోక్ మాదిరి తన మాటలకు తానే పగలబడి నవ్వుతోంది ఆమె.

"ఏమిటి అంతగా నవ్వుతున్నావ్? మాకూ చెప్పూ అదేదో- పాలు పంచుకుంటాం—" అంటూ మిస్ మరీచిక, శ్రీమతి అనసూయ అక్కడకు వచ్చారు.

వసంత నవ్వుతూనే తులసిని చూసింది.

"ఏమోయ్ తులసీనాథ్! నీ దేవత ఇంకా రాలేదా?"

"మహాతల్లికి ఎన్ని పెత్తనాలో! ఎంత మందితో పరిచయమో! తెమిలి రావద్దూ పాపం–" మిస్ మరీచిక వ్యంగ్యంగ అంది.

"చేసేది శివపూజలు దూరేది... అన్న సామెతలా పూజలూ పునస్కారాలు వెలగ బెడుతోంది పైగా"

"అదంతా లోకం కోసం చేసేనటన–"

"నిజమే! అసలు భాగోతం ఎవరికి తెలీనిది. నిన్న ఏమయిందంటే......"

"ఏం జరిగిందేమిటి!" శ్రీమతి అనసూయ మాటల్ని మధ్యలోనే అందుకుంచి ఆసక్తిగా వసంత.

"మావారు ఓస్నేహితునితో కలసి పిక్చర్ కెళ్ళారట ఈ మహాతల్లి ట్రిమ్‌గా తయారయి ఎవడ్నో వెంటబెట్టుకుని వచ్చిందట సినిమాకు మావార్ని చూసి ప్రక్కకు తప్పుకుందట మావారి కెందుకో అనుమానం కలిగి చూస్తే మధ్యలోనే "లేచి పోయిందట–" లేచిపోయిందన్న పదం నొక్కి పలుకుతూ చెప్పింది.

"అలాగేం! ఇంతకూ ఆవిలాస పురుషుడెవరో?"

"ఎవడైతేనేం? మోజుతీర్చుకునేందుకు"

"అవున్లే పాపం! కట్టుకున్నవాడు మోసం చేస్తే లోకం గొడ్డుపోయిందా? గింతకు తగ్గ బొంత ఎవరో ఒకరు దొరుకుతూనే వుంటారు".

"మనకెందుకులే- వెళ్దాం పదండి సెకండు బెల్ కూడా కొట్టారు." అంటూ ముందుకు దారి తీసింది శ్రీమతి అనసూయ.

"పదండి–" అంటూ చటుక్కున తులసి చేతిలోని పువ్వులాక్కుని వాసన చూస్తూ వెళ్ళిపోయింది వసంత. అనుకోని ఈ సంఘటనకు ఖంగారుపడి పోయాడువాడు. తన అమూల్యసంపదనెవరో దోచుకు పోతున్నట్టు విల విల్లాడి పోయాడు.

"టీచర్! టీచర్..." అంటూ జాలిగా వెంట బడ్డాడు.

"ఏంటోయ్ వెధవగోల- బెల్లు కొట్టారు క్లాసుకు వెళు –" అని గదిమింది. అయినా వినేదు వాడు. "అది జలంధర టీచర్ కోసం తెచ్చింది మీకు కావాలంటే రేపు తెస్తాను. ఇవ్వండి టీచర్–" అంటూ ప్రాధేయపడ్డాడు

"బోడిపువ్వు తీసుకెళ్ళు" విసురుగా నేలకేసి కొట్టి చరా చరా వెళ్ళిపోయింది గులాబి రెక్కలూడి, ధూళిలో పడిపోయింది. అరికాళ్ళల్లో మేకులు దిగినట్టు అల్లాల్లాడి పోయాడు తులసి. చటుక్కున పువ్వు అందుకుని మట్టి దులిపేడు ప్రయోజనం లేకపోగా మరిన్ని రెక్కలూడిపోయాయి. అందమైన జలంధర టీచర్ సిగలో గుబాళించవలసిన గులాబి ధూళిపాలైపోయింది. కన్నీళ్ళ పర్యంతరమయినాడు వాడు వసంత టీచర్ మీద పట్టరాని ఉక్రోషం–కోపం వచ్చేసాయి టీచర్ అన్న గౌరవం కూడా లేకుండా లోలోనే కసిగా తిట్టిపోశాడు. క్లాసుకు వెళ్ళ బుద్ధి కాక, స్కూలు కెదురుగా బయట ఆవరణలో వున్న చెట్టుక్రింద కూర్చున్నాడు దిగులుగా. ఇవ్వాళ టీచర్‌కి పువ్వు ఇవ్వలేక పోయానే, అన్న దిగులు వాడిని క్రుంగ దీస్తుంది. టీచర్ ఎందుకు రాలేదో నన్న ఆదుర్దా కూడా మరో ప్రక్క పుండులా సలుపుతోంది.

మధ్యాహ్నం స్కూలు వదిలే దాకా చూసాడు. ఆదుర్దాను అణుచుకోలేక నేరుగా టీచర్ ఇంటికే వెళ్ళాడు "టీచర్...టీచర్! అంటూ నెమ్మదిగా తలుపు తట్టాడు. జవాబు రాలేదు. కొన్ని క్షణాలు తటపటాయించి, దగ్గరకు చేరవేసి వున్న తలుపుల్ని నెట్టుకుని లోనికి వెళ్ళాడు. జలంధర మంచం పైన పడుకుని ఏదో ఫోటోని తదేకంగా చూస్తుంది. ఆమె కళ్ళనిండా నీళ్ళు! గుండెల్ని పిండేస్తున్న దుఃఖంతో వొగిపోతూ పిచ్చి చూపులు చూస్తోంది...

"టీచర్..." దగ్గరగా వెళ్ళి పిలిచాడు తులసి ఆమె ఉలిక్కిపడి తేరుకుంది వెంటనే కళ్ళు తుడుచుకుని నవ్వింది మృదువుగా– కాదు పిచ్చిగా–టీచరెందుకో ఏడుస్తుందని పసిగట్టాడు వాడు అప్రయత్నంగా వాడి చూపులు ఫోటోపైన నిలిచాయి. దాన్ని చూసి ఆశ్చర్యంతో దిమ్మెరపోయాడు. అర్థం కాని వాడిలా టీచర్ కేసి చూసాడు. ఫోటో వాడికందించి లేచి కూర్చుంది ఆమె వాడి ఫోటోను వింతగా పరికించ సాగేడు


'సందేహం లేదు అది తన ఫోటోనే! టీచర్‌కి తన ఫోటో ఎలా వచ్చింది? రూపురేఖలన్నీ తనలాగే వున్నాయి. ఫోటోలో వున్న దుస్తులు తనెప్పుడూ తొడుక్కో లేదే? ఈ ఫోటో చూసి టీచర్ ఏడ్చింది ఎందుకు? ఎవరిదీ ఫోటో?' ఎన్నో ఆలోచనలు ఒక్క ఉమ్మడిగా దాడి చేసాయి వాడి మస్తిష్కం పై.

ఆమె నవ్వింది. వాడి ఆలోచనలు పసిగట్టిన దానిలా

"ఫోటో బావుందా?" తలూపేడువాడు.

"అచ్చు నీలానే వుంది కదూ!" అవునన్నట్టు తలాడించాడు.

"అది మా అబ్బాయి రవి ఫోటో–" భారమైన నిట్టూర్పు వెలువడింది ఆమె నుండి.



"అంటే, మీకు పెళ్ళయిందా టీచర్? ఈ పిల్లాడితను ఎక్కడున్నాడు?"

'తనకి తెలీకుండా టీచర్‌కి పెళ్ళెప్పుడయింది? ఈ ఫోటోలో వున్న అబ్బాయి టీచర్ కొడుకట. మరి టీచరెప్పుడూ ఒంటరిగానే వుంటుందే? ఎవరూరారేమిటి? మొన్న టీచర్ ఎవరితోనో సినిమాకు వెళ్ళిందట. ఎవరతను? తనెప్పుడూ చూడలేదే? పోనీ టీచర్ని అడిగితే? ఊహూఁ... బావుండదు–' వాడి చిన్నారి బుర్రలో టీచర్ని గురించి ఎన్నో సందేహాలు–ప్రశ్నలు.

ఆ తరువాత వాడి సందేహాలు తీరుస్తూ తన కథ చెప్పింది వాడి కర్థమయ్యేవిధంగా—

* * *

కొన్ని కొన్ని జీవిత సత్యాలు అతి ఆలస్యంగా బోధపడతాయి. జలంధరకు కూడా శంకర్ నిష్క్రమణలో ఎన్నో విషయాలు అవగతం అయ్యాయి. తాను నడిచింది తప్పు మార్గమని అప్పుడే తెలిసింది. దిద్దుకోలేని అపరాధం చేసింది తను. పూడ్చలేని అగాధం ఏర్పడింది అప్పటికే.

మనసా, వాచా నమ్మిన శంకర్ వెంట వచ్చేసింది కన్నవాళ్ళను కాదని. ఫలితంగా నలుగురిలో పలచనయింది. నమ్మినవాడు సర్వస్వాన్ని దోచుకుని పరాభవించేడు లోకానికి లోకువయింది. ఎన్నో వికృత హాసాలు గునపాల్లా గుచ్చాయి. ఎన్నో వ్యంగ్యాలు అంతరంగాన్ని తూట్లు పొడిచాయి. మరెన్నో కళ్ళు వెంటాడి వేధించాయి. అయినా వెనుదీయలేదు. పిరికి దానిలా పారిపోలేదు. ఎన్నో క్లిష్టతరమైన పరిస్థితులకు ఎదురు నిలిచి పోరాడింది. ఎందుకు? జీవితంపై మమకారం చంపుకోలేక కాదు. తనలో రూపు దిద్దుకుంటున్న బిడ్డకోసం మాతృమూర్తిని కావాలన్న వాంఛతో! తన వలపు పంటను కనులారా కాంచాలని, ఆశతో ఎదురీదింది. జీవితంతో పోరాడింది.

మమతల్ని రంగరించి పోసింది కంటిపాపకన్న మిన్నగా కాచుకుంది. వాడి భవిష్యత్తు జాజ్వల్యమానంగా ప్రకాశించాలని కలలు గన్నది. తన చీకటి బ్రతుకున కాంతి రేఖగా భాసిస్తాడని కాంక్షించింది. నిర్విరామంగా శ్రమించింది. కన్నతల్లి ప్రేమ సుధారసాన్ని ఆస్వాదిస్తూ చిట్టిపలుకులతో తప్పటడుగులతో, ఏపుగా పెరుగుతున్న ఆ బిడ్డను చూడలేక దుర్విధి కళ్ళల్లో నిప్పులు

# తులసి పుష్పం

దిమ్మరించుకున్నది భయంకర వికటాట్టహాసం చేసింది. ఫలితంగా పదేళ్ళ రవికి అప్పుడే నూరేళ్ళు నిండాయి.

కన్నతల్లి మమతల్ని త్రుంచుకుని–బంధాలను తెంచుకుని ఆమె ఎదలో బడబాగ్ని రగిల్చి– ఆమె జీవితం చీకటి ఎడారి చేసి వెళ్ళిపోయాడు రవి. కదిలిపోయిన స్మృతుల్ని మరచిపోదామనుకున్నది. కానీ, ఏ ఆశతో జీవించాలో తెలీలేదు. అయినా మొండిగా ప్రాణమున్నంతవరకూ బ్రతకాలనుకుంది, ఈ జీవితంలో ఇంకెన్ని తమాషాలు జరుగనున్నాయో చూద్దామనుకున్నది. దృఢ నిశ్చయంతో టీచర్ ట్రెయినింగ్ పూర్తిచేసింది. మనసును విజ్ఞాన పథాలవేపు మళ్ళించింది. తనకు తెలిసింది పదుగురికీ పంచాలనుకున్నది. అదే తన జీవిత పరమావధిగా

పై వారమే!

రాగద్వేషాలు

సీరియల్!

ఎంచుకున్నది. అందుకు ఆమె చిన్ననాటి నేస్తం జయంత్ ఎంతో దోహదంచేశాడు. అదే ఆశయంతో ముందుకు నడిచి ఉద్యోగం సంపాదించుకున్నది.

కానీ, ఎక్కడకెళ్ళినా తన దురదృష్టాన్ని ఎత్తి చూపుతూ – తన తప్పిదానికి శిక్ష వేసినట్లు– సూటి పోటి మాటలు, వ్యంగ్య విసుర్లు– అసహ్యకరమైన ఛలోక్తులు! విని విని మనసు– మెదడు మొద్దుబారిపోయాయి. రానురాను వాటికి అలవాటు పడిపోయింది. ఎవరేమనుకున్నా తనను కాదనుకుంది.

ఇలాంటి తరుణంలో– టీచర్‌గా ఆ స్కూల్లో చేరిన కొలది దినాలకు తులసిని చూసింది. హృదయం వేగంగా స్పందించింది! మదిలో ఏమూలనో దాగిన మాతృప్రేమ ఉప్పెనలా పొంగింది. తులసిలో తన కొడుకు రవి పోలికలుండడం వలన మరింత అనురాగం ఏర్పడింది. దానికి తోడు తన కిష్టమైన గులాబి తెచ్చిస్తూ 'టీచర్' అంటూ అభిమానంగా వెంటపడే వాడి మమతకు కట్టుబడి పోయింది.

మాటలకందనిది, నిర్వచింప పదమేలేనిది వారి రాగబంధం

* * *

ఆరోజు యథాలాపంగా స్కూలుకు వచ్చింది జలంధర రోజులా గేటువద్ద తులసి కనిపించలేదు హెచ్.యం. గది ముందు చాలా మంది టీచర్స్-పిల్లలు గుమిగూడి వున్నారు ఏమిటోనని అటుగా నడిచింది జలంధర.

గుంపు మధ్య బిక్కచచ్చి, అవమానంతో సిగ్గుతో తలొంచుకుని నిలుచున్నాడు తులసి. ఓ నలభై ఏదేళ్ళ వృద్ధ స్త్రీ మొరటుగా వాడిచెవి మెలిపెడుతూ గట్టిగా తిట్టిపోస్తుంది హెచ్.యం. ఆమెను వారిస్తూ– "అండాళ్ళమ్మగారు! మీరూరుకోండి. వాడి విషయం నేను తేలుస్తాను. మరోసారి అలాంటి పనులు చెయకుండా దండిస్తాను. మీరు వెళ్ళిరండి–" అని అడ్డుకుని వాడి రెక్క పుచ్చుకొని తనగదిలోకి తీసికెళ్ళింది.

"మాయదారి చచ్చినోడు! చెట్టంతా నాశనం చేసాడు పీడిచేతులిరిగిపోను– పూచిన పువ్వుల్నా తెంపేశాడు. ఈ సారి అవేపుకురా కాళ్ళు రెండూ విరగ్గొట్టి పొయ్యిలో పెడతాను..." తిట్టుకుంటూ వెళ్ళిపోయిందామె.

విషయమేమిటో సరిగ్గా బోధపడక నిర్విణ్ణురాలైంది జలంధర. ఇంతలో బెల్లు కొట్టడంతో ఎవరి క్లాసులకు వారు వెళ్ళిపోయారు. జలంధర కూడా అన్యమనస్కంగానే క్లాసుకు వెళ్ళింది. లెస్సన్ మొదలెట్టబోయే సరికి హెచ్.యం. గారి వద్దనుండి పిలుపొచ్చింది తన సందేహాల్ని ప్రక్కకునెట్టి లేచి వెళ్ళింది.

"కూర్చో–" కుర్చీచూపించింది హెచ్.యం.

అప్పటికే స్టాఫంతా వచ్చి కూర్చున్నారు. తులసి సిగ్గుతో తలదించుకుని ఓ మూలగా కూర్చున్నాడు ఎందుకో వాడినలా చూస్తుంటే ఆమె మనస్సు కలుక్కుమంది 'వీడు చేసిన నేరమేమిటి? ఆమె తిట్టుకుంటూ వెళ్ళింది– ఎవరామె?' అని అనుకుంది.

"జలంధరా! వీడు నీకు బాగా తెలుసనుకుంటాను–" హెచ్.యం. ప్రశ్న. ఆమె

ఏందుకలా ప్రశ్నిస్తుందో అర్థం కాలేదు జలంధరకు. మౌనంగా తలూపింది.

"ప్రతిరోజూ వీడు నీకు గులాబి పువ్వు తెచ్చిస్తున్నాడు కదూ?"

'అవునన్నది. స్టాఫంతా తనవే చూస్తున్నారు గుచ్చి గుచ్చి.

"ఆ పూలు ఎక్కడ నుండి తెస్తున్నాడో తెలుసా?"

"ఈ ప్రశ్నలు ఎందుకేస్తున్నారో తెలుసుకోవచ్చా?" ఎదురు ప్రశ్నవేసింది జలంధర.

"తగిన కారణముండబట్టే అడుగుతున్నాను. నీకోసం వీడు దొంగతనం చేసాడు. దీనికి సమాధానం?" తీక్షణతతో ఆమె కను బొమలు ముడివడ్డాయి.

"ఏమిటి తులసి దొంగతనం చేసాడా! ఇంపాజిబుల్! వాడెన్నడూ అలాంటి పనులు చేయడు—" నమ్మలేక పోతుంది జలంధర.

"ప్రత్యక్షంగా కనిపిస్తుంది. ఈ విషయం నీకు తెలీదంటే మేము ఆశ్చర్యపోవాలిగానీ నీవెందుకంత తెల్లబోతావు?"

'అంటే ఏమిటి? నీకు తెలిసే దొంగతనం జరిగిందనా? తనకు తెలిసినంత వరకూ తులసి చాలా మంచివాడు. దొంగతనం చేయాల్సిన ఖర్మ వాడికేం పట్టింది? ఇంతకూ ఏం చేసాడు?' అని అనుకుని— "మీభావం నాకర్థం కాలేదు" పొడిగా అన్నది.

"అర్థమయ్యేలా విప్పి చెప్పమంటావా? అయితే విను. వీడికి తల్లిదండ్రులు లేరు. ఎవరో ముసిల్దివాడు పెంచుకుంటున్నాడు. అతను ముష్టి తెచ్చి వీడ్ని చదివిస్తున్నాడు. ఒక పూట తింటే మరో పూటకు తిండి లేనివాళ్లు. అలాంటి వాడు నీకు రోజూ గులాబి తెచ్చిస్తున్నాడు. ఎలా తేగలుగుతున్నాడో నీ వెప్పుడైనా ఆలోచించావా?" క్షణం ఆగి కోపంగా చూస్తూ "నీ వెందుకు ఆలోచిస్తావు? చక్కగా పువ్వు సింగారించుకుని స్టైల్‌గా ఫోజులు కొడుతున్నావు. ఇది దేవాలయం కన్న పవిత్రమైన స్థలమని, పెద్దల్ని చూసి పిల్లలు నేర్చుకుంటారన్న ఇంగితం నీ కున్నదా?" అని అన్నది.

జలంధర ముఖం మ్లానమయింది.

బాధ్యతగల ఉన్నతాధికారి అలా నీచంగా అసహ్యకరంగా, నిజా నిజాలు యోచించకుండా, ఎదుటి మనిషిని— పాటి వుద్యోగిని అన్న వివేకం లేకుండా స్టాఫు ముందు దుమ్మెత్తి పోస్తుందని ఊహించలేదు తను.

ఆమె మనస్సు మూగగా రోదించింది. గొంతు పెగల్లేదు ఎందుకో—కానీ, ఆత్మాభిమానం ఊరుకోనీలేదు— బుస్సున పొంగి పైకి వచ్చింది.

"నిజా నిజాలు తెలుసుకోకుండా నిందా రోపణలు చేయడం వివేకవంతుల లక్షణం కాదు. తులసిని గురించిన వివరాలు మీరు చెప్పేదాకా నాకేమీ తెలీవు. పెరట్లో పూస్తున్నాయి పెట్టుకునే వాళ్ళు లేరని తెచ్చిస్తుంటే తీసుకున్నాను. పది పైసలు పెట్టి పువ్వు కొనుక్కోలేని గతిలేనిదాన్ని కాదు. వాడు అభిమానంతో తెచ్చిస్తుంటే కాదన



లేక తీసుకుంటున్నాను అంతకు మించి నాకేమీ తెలీదు. దొంగతనంగా ఎవరివో తెంపుకొస్తున్నాడని నేనెలా ఊహించగలను? వాడలా చేస్తున్నాడని నేనేమన్నా కలగన్నానా?" తీవ్రంగా ప్రశ్నించింది. జలంధర మాటలు హెచ్. యంగారి కోపాన్ని రెచ్చగొట్టాయి.

"వాడెవరో నీకు తెలీదంటే హాస్యాస్పదమే! కల్లబొల్లి మాటలతో కప్పిపుచ్చుతున్నావ్. వాడిని ఆపనికి పురిగొల్పింది నీవే! వాడిబుద్ధి పెడదారిన మళ్ళించి వాడిని చెడగొట్టింది నీవే. నీవు తెమ్మనందే వాడెందుకు తెస్తాడు? అంత అగత్యమెందుకు ఏర్పడుతుంది —దొంగ చాటుగా పూలు తెంపుకు రావడానికి? ఈనాడు ఇదయింది రేపు మరొకటి..."

"చాలించండి మీమాటలు! నిరాధారమైన మీ ఊహలతో ఎంత సంస్కార హీనంగా మాట్లాడుతున్నారో అర్థమవుతుందా? ఆడవారైవుండి పువ్వుల విషయంలో— నా మాట వినిపించుకోకుండా నన్నెందుకింతగా అవమాన పరుస్తున్నారో ఇప్పుడర్థమయింది. సరే, అవన్నీ నావ్యక్తిగత విషయాలు. వాడిని నేనే తెమ్మన్నానో, లేక వాడే తెచ్చాడో-నాకూ—వాడికీ తెలుసు. మీలాంటి వాళ్లకు చెప్పినా అర్థం కాదు. నా విషయాల్లో జోక్యం చేసుకుని నిందించే హక్కు, అధికారం ఎవరికీ లేదు. చెప్పండి— స్కూలుకి సంబంధించిన వరకు నా నేరమేమిటో?" జలంధర మాటలకు హెచ్.యం బెబ్బులే అయింది.

"నీతి నియమాలు లేనిదానవు. విద్యాబుద్ధులు నేర్పి మేధావులుగా తయారు చేయవలసిన పిల్లల్ని పెడత్రోవ పట్టించి వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నావ్. నీలాంటి వారికిక్కడ స్థానంలేదు. నిన్ను సస్పెండ్ చేస్తున్నాను—"

"మీకా శ్రమ అక్కర్లేదు. నేనే రిజైన్ చేస్తున్నాను. చివరిగా నాదొక్కమాట! మీవంటి బుద్ధిహీనురాలి వద్ద ఇన్నాళ్ళు పని చేసినందుకు సిగ్గుపడుతున్నాను. అవివేకంతోనూ, అహంకారంతోనూ, ఇంకెప్పుడూ ఎదుటివాళ్లను బాధించకండి. సంస్కారం నేర్చుకోండి. అప్పుడే మీరు ఉత్తమ ఉపాధ్యాయినిగా రాణించ గలేది.

వస్తా—" చరచరా అక్కడనుండి లేచి వెళ్ళిపోయింది జలంధర.

హెచ్చ్. యం. గారి ముఖం పాలిపోయింది.

మిగతా టీచర్ల ముఖాలు అదోలా మారిపోయాయి. వారి ముఖాల్లో తాండవించేది విచారమో, ఆనందమో, తెలీడం లేదు.

* * *

పై సంఘటన జరిగిన రెండో రోజు తులసి ఎప్పటిలా గులాబీ తీసుకుని టీచర్ ఇంటికి వెళ్లాడు. వాడిని చూస్తూనే కోపాన్ని నిగ్రహించుకోలేక పోయింది

### మూడు ముళ్లు

— కాణిపాకం లింగన్న

ఒకటవ ముడి—
గంగా యమునల సంగమం.
రెండవ ముడి—
మన మిద్దరు మన కిద్దరు.
మూడవ ముడి—
త్రికరణ శుద్ధివైపు జీవన గమ్యం.
అద్వైత ప్రేమానుభూతికి,
స్త్రీ పురుష సమైక్యత—
ఆత్మ పరమాత్మల
ఏకత్వ సాధన చిహ్నం.
అందుకే—
మూడు ముళ్ళు
జీవన సార్థక సాధనం.

జలంధర. 'వీడి వలననే గదా తను నల్గురిలో అవమానింపబడింది—' అన్న భావన ఆమెలోని వివేకాన్ని నశింప జేసింది.

"సిగ్గులేదూ! మళ్ళీ ఎందుకొచ్చావు? ఎక్కడ దొంగతనంచేసి తెచ్చావు?" తీక్షణంగా చూసింది.

వాడు దెబ్బతిన్న పక్షిలా బెదురుగా చూసాడు.

"టీచర్! మీరు కూడా నన్ను..." వాడేదో చెప్పాలనుకున్నాడు. మధ్యలో అడ్డుకుంది. "నోర్ముయ్! రాస్కెల్..." వాడి చెంప 'ఛెళ్ళు' మంది, గిర్రున కళ్లలో నీళ్ళు తిరిగాయి.

"దేన్నయినా సహిస్తానుగానీ, దొంగతనాన్ని, అబద్ధాన్ని సహించలేను. వెధవపనులు చేసి నన్ను తలెత్తుకోకుండా చేసావు వెళ్ళు నీముఖం నాకు చూపించకు—" ఆవేశంతో ఊగిపోయింది. ఆమె కళ్ళు జ్యోతుల్లా మండుతూ, క్రోధాగ్నిని రాలుస్తున్నాయ్.

ఆ విధంగా టీచర్ని ఎన్నడూ చూడలేదు వాడు. దుఃఖం ఉప్పెనలా ముంచుకు వచ్చింది. జాలిగా గులాబిని చూస్తూ మెల్లని స్వరాన అర్థించాడు—

"టీచర్... ఇంకెప్పుడూ తేను. ఈ ఒక్కసారికే తీసుకోండి..."

"తీసికెళ్ళి చెత్తకుండీలో పారెయ్యి. ఇంకెప్పుడూ ఈ వేపుకురాకు. వెళ్ళు... నీకే చెప్పేది...నీముఖం చూస్తేనే పాపం—" వాడి మాటలు వినిపించుకోకుండా బయటకు గెంటి ఛళ్ళున తలుపేసేసింది.

ఆక్షణం నుండి ఎడతెరిపి లేని ఆలోచనలతో—ఉద్వేగంతో నలిగి పోయిందామె. గుండె నొప్పి ఎక్కువై మంచం పట్టింది. ఈ వారం దినాలు నిద్రాహారాలు లేకుండా క్రుంగి పోయింది. చిన్ననాటి మిత్రుడు జయంత్ రోజూ వచ్చి పోతున్నాడు. అతడూ ఆ ఊర్లోనే పని చేస్తున్నాడు. జలంధర అంటే అతనికి వల మాలిన అభిమానం. సొంత చెల్లిలా ప్రేమించు తున్నాడు. డాక్టర్‌కి చూపి మందులు తెచ్చాడు. ఏ మందులూ ఆమెనుమార్చలేకపోతున్నాయ్. మానసికంగా బాగా క్రుంగి నీరసించి పోయింది. జయంత్ ధైర్యం చెబుతూ ఓదార్చుతున్నాడు.

ఎన్ని మందులు తిన్నా, ఎన్ని శాంత వచనాలు విన్నా—అనుక్షణం ఆనాటి సంఘటన— తన దూషణ వాక్యాలు, తులసి జాలి చూపులు కళ్లముందు కదిలి వెంటాడి వేధిస్తున్నాయ్. ఈవారం దినాలు తులసి ఆ వేపుకు రానేలేదు.

అలా పరుషంగా వాడిని నిందించి కొట్టినందుకు తన్నుతాను తిట్టుకుంది. వాడి పసి మనసు ఎంతగా తల్లడిల్లి పోతుందోనని దిగులుతో క్రుంగిపోసాగింది. ఆవేశం తగ్గాక తన్ను తాను విమర్శించుకుంది.

'వాడు దొంగతనంగా పూలు తేవాల్సిన అగత్యం ఏమి కల్గింది? తనకోసమేగదా! తాను పువ్వు తీసుకోనేమోనని అలా అబద్ధం కల్పించిచెప్పాడు. ఎందుకు? తను పువ్వు తీసుకోకపోతే వాడికెందుకు బాధ? తనమీద ఎంత అభిమానం లేనిదే వాడలా చేస్తాడు?

ఇలా జరగడానికి పరోక్షంగా తానే కారణం, మంచి మాటలతో చెప్పాల్సింది — అలా చేయడం 'తప్పని' వాడు తెలుసుకునేలా నచ్చ జెప్పాల్సింది తను తొందరపడింది. ఆ క్షణంలో ఏ మహమ్మారి తన నెత్తిన కూర్చుందో చేయి కూడా చేసుకుంది.'

ఆవేశం, వివేకాన్ని నశింప జేస్తుందన్న సత్యం ఆమె స్వానుభవంలో తెలుసుకుంది.

'తులసి ఏమయినాడు ? ఆ రోజు నుండి రానేలేదు. తను తిట్టినందుకు మనసు కష్టపెట్టుకున్నాడేమో? వాడికి ఎవరూ లేరట. ఎవరో ముసలాయన పెంచుకుంటు న్నాడట. ఆ విషయం వాడె వ్వడూ చెప్పలేదు. తనూ అడగలేదు. చాలాసార్లు మాటల సందర్భంలో 'టీచర్... మీరు అచ్చం అమ్మలా వుంటారు'అని పరవశంగా చూసేడు తనవేపు. తను నవ్వి ఊరుకునేదే గానీ, వాడి మాటలోని లోతయిన భావాన్ని గ్రహించలేకపోయింది ఆలోచిస్తుంటే ఇప్పుడర్థమవుతుంది. వాడి చేతల్లోనూ, మాపుల్లోనూ, వ్యక్తమైన మాతృప్రేమ! తల్లిప్రేమకు నోచుకోని అభాగ్యుడు. తనను చూసి 'అమ్మ'గా ఊహించుకుని వుంటాడు. అందుకేనా అంత ప్రేమగా పూలు తెస్తుంది? తులసీ...! ఎక్కడున్నావయ్యా? నేనెంత పాపాత్మురాల్ని వెన్నలంటి నీ మనస్సును —మమతను గ్రహించలేక కర్కశంగా తూల నాడేను. నీ గుండెల్లో పొంగుతున్న మమకారం నాకు బోధపడలేదయ్యా ఇన్నాళ్లూ... నా పాపానికి నిష్కృతిలేదు. భగవాన్! నన్నెందుకింత కఠినురాలిగా చిత్రించావ్...' అని కన్నీరు మున్నీరుగా విలపించింది.

ఆపైన గుండెనొప్పితో స్పృహతప్పింది.

సాయంత్రం దీపాలు పెట్టేవేళ మగతగా కనులు తెరిచింది.

బయట ఎవరో పిలుస్తూ తలుపు తడుతున్నారు. మెల్లగా లేచి తూలుకుంటూ వెళ్లి తలుపు తెరిచింది. ఎదురుగ్గా ఓ అరవైఏళ్ల వృద్ధుడు.

"ఎవరయ్యా నీవు?" కళ్లు చిట్లించి ప్రశ్నించింది జలంధర.

"మీరేనా జలంధర టీచర్" రుద్ధ కంఠంతో ప్రశ్నించాడా వృద్ధుడు.

"అవును" అర్థంగాక బదులిచ్చింది.

తన భుజంపై గుడ్డ కప్పి పడుకో బెట్టిన అబ్బాయిని దింపి క్రిందగా పడుకో బెట్టాడు. ఆమె నిర్ఘాంతితో చూడ సాగింది ముఖంపై గుడ్డ తొలగించాడు. అతను.

"తులసీ!!" కెవ్వున అరిచింది ఆ ముఖం చూడగానే.

"అవునమ్మా తులసే! మీ తులసే!! మీరు కోపగించుకున్నారని బెంగతో తల్లడిల్లి మంచంపట్టి ప్రాణం తీసుకున్నాడు. తల్లి ప్రేమకు దూరమయి, మీపై మాతృప్రేమను పెంచుకుని, మిమ్మొక దేవతగా ఆరాధిస్తున్న వాడిని దొంగనుచేసి తిట్టి కొట్టి చంపారు—"

"వాడు దొంగ కాదమ్మా! ఆ అండాళ్ళు ముండే దొంగది. మా ప్రక్కింటావిడ ఆ అండాళ్ళమ్మ. చెట్లు పెంచుకుంటూ మా వాడిచేత నీళ్లు పోయించుకునేది. లంకంత పెరడులో నాటిన కూర పాదులకు, పూల మొక్కలకు నీళ్లు పోసేవాడు. 'ఒరే పూలు నీకేరా!' అంటే పొంగిపోయాడు. రోజా మీకు పూవు ఇచ్చాడు. మీపై ఆరాధన అర్థమైన అసూయాపరుల మాటలకు మరుతున్న అండాళమ్మ స్కూలుకి వచ్చి వాడిపై రిపోర్టు చేసింది. వాడు దొంగన్నా బాధ పడలేదు. కానీ మీ మాటలకే వాడు చచ్చాడు—"

ఆ మాటలు ఆమెకు గునపాల్లా గుచ్చుకున్నాయ్.

గాయపడిన గుండెల్ని ఊపేశాయ్. అసలే బలహీనంగా వున్న ఆమెగుండె గుబగుబ లాడింది. ఆమె కేమీ కనిపించడంలేదు— వినిపించడంలేదు.

"బాబూ... తులసీ!!" ఒక్కసారి బిగ్గరగా అరిచి, నిర్జీవంగా వున్న తులసిపై వాలిపోయింది జలంధర.

"తులసీ! బాబూ...ఎక్కడ నీవు ? వస్తున్నా...ఆగు. నేనూ వస్తున్నా—కన్నా ఆగు . ఈ అమ్మ నీకోసం వస్తుంది తండ్రీ ఆగు"...

'అమ్మా! ఇక్కడే.. ఇక్కడే వున్నాను. నీవెంటే —నీ నీడలా—'

విధి వేరు చేసినా, ఆ రెండు హృదయాలు కలుసుకున్నాయ్ ఆ లోకంలో—



## ఛాంపియన్ మహిళ

29 ఏళ్ల సోవియట్ యువతి స్వెత్లానా సవిత్స్కాయా విమానయానంలో కొత్త ప్రపంచ స్పీడు రికార్డు స్థాపించింది. సోవియట్ ఇ-133 జెట్ విమానంలో చేసిన వెయ్యి మైళ్ళ ప్రయాణంలో ఈ కొత్త రికార్డు సృష్టించింది. 200 కిలో మీటర్ల దూరాన్ని గంటకు 2333 కిలో మీటర్ల సగటు వేగంతో విమానాన్ని నడిపి, ఆ తదనంతరం గంటకు 2600 కిలోమీటర్ల వేగాన్ని పుంజుకుని పెండుసారిపోల వేగాన్ని అధిగమించింది.

విమానాన్ని వేగంగా నడపడంతోపాటు ప్యారా చూటింగ్, ఎయిరో బాటిక్స్ జెట్ ప్రొపెలర్ ఫ్లయింగ్‌లలో కూడా ఎన్నో విజయాలు సాధించింది, కొత్తకొత్త రికార్డులు సృష్టించింది.

16వ ఏట స్వెత్లానా ఫ్లయింగ్ క్లబ్‌కి దరఖాస్తు పెట్టుకున్నప్పుడు, 'మువ్వు మరీ చిన్న పిల్లవు' అని సభ్యత్వం ఇవ్వలేదు. అయినా ఆమె తన పట్టుదల వదలలేదు చిన్నతనం నుంచి విమానంలో పైలెట్ సీటులో కూచొని ఆకాశంలో విహరిస్తున్నట్లు కలలు కనేది. చివరికి ఆమె కలలు ఫలించాయి. ఆమె నడిపిన మొదటి విమానం సి.ఎస్.-౨. ప్యారాచూట్ జంపింగ్‌లో ఆమె అనతికాలంలో అత్యంత ప్రతిభ సంపాదించింది.

బ్రిటన్‌లోని హాలావింగ్‌టన్ ఎయిర్ బేస్ నుంచి ప్రపంచ విమానయాన ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. అందులో స్వెత్లానా పాల్గొంది. అప్పటికి ఆమె వయస్సు 21. వున్న అనుభవం 300 గంటల విమానయానం. ఈ పోటీలో అమెరికాకు చెందిన మహిళా ఛాంపియన్ ఎమ గఫినెను అవలీలగా ఓడించి స్వెత్లానా ప్రపంచ మహిళా ఛాంపియన్ పదవిని సంపాదించింది.

*